

19 మండలాల్లో వర్షం



చిత్తూరు శివార్లలో తాణా వద్ద కనిపించిన ఇంద్రధనస్సు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 19 మండలాల్లో ఓ మోస్తరు నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా పుంగనూరులో 28.4 మి.మీ, అత్యల్పంగా గుడుపల్లెలో 5.4 మి.మీ వర్షం కురిసింది. మండలాలవారీగా.. గుడిపాలలో 26.4, తవణంపల్లెలో 26.2, బంగారుపాళ్యంలో 25.2, చౌడేపల్లెలో 20.2, శాంతిపురంలో 19.6, రామకుప్పంలో 18.2, విజయపురంలో 17.2, చిత్తూరు అర్బన్‌లో 13.6, కుప్పంలో 13.2, యాదమరిలో 12, గంగవరంలో 11.8, గంగాధరనెల్లూరులో 10.8, చిత్తూరు రూరల్‌లో 10, పెద్దపంజాణిలో 9, పలమనేరు, బైరెడ్డిపల్లెలో 7.6, వి.కోటలో 5.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

కల్యాణ వైభవం

రామకుప్పం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో వార్షిక సోమవారోత్సవాలు గత వారమే ముగిసినా, ఈ సోమవారం కూడా భక్తులు స్వామి వారి దర్శనార్థం తరలివచ్చారు. తెల్లవారు జామునే పురోహితులు కృష్ణమూర్తి, వాసులు స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆలయ ఈశాన్య దిక్కున గల నాగులపుట్ట, నాగదేవతల విగ్రహాలకు పూజలు చేసి పాలు, పండ్లు సమర్పించారు. వేప, రావి వృక్షాలకు పూజలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 12గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. వేదపండితులు సందీప్‌శర్మ, నాగరాజశర్మలు సర్వాలంకార శోభితులైన వళ్లీ, దేవసేన, సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవర్లును కల్యాణ వేదికపై అధిష్ఠింపజేశారు. వివిధ హోమాల నిర్వహణ అనంతరం, వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య మాంగల్యధారణ తంతు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని వరసిద్ధి వినాయకస్వామి, బాలమురుగన్, నాగులముద్దమ్మ, శనీశ్వరస్వామి, పద్మావతి, వేంకటేశ్వరస్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.





కల్యాణోత్సవ శోభలో వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి - ఆలయం వద్ద భక్తుల సందడి

విజనరీ లీడర్ చంద్రబాబు

- స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో విప్ యార్లగడ్డ వెంకట్రావు

స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయ విభాగం





చిత్తూరులో అవార్డు అందుకుంటున్న జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు - డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, సీఈవో శంకర్‌బాబు





విజయవాడలో సీఎం చంద్రబాబు నుంచి రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డు స్వీకరిస్తున్న కుప్పం, పలమనేరు కమిషనర్లు వి.శ్రీనివాసరావు, ఎస్.వి.రమణారెడ్డి



స్వచ్ఛాంధ్ర అవార్డు స్వీకరిస్తున్న చిత్తూరు డీపీటీవో రాము

చిత్తూరు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):విజనరీ లీడర్ చంద్రబాబు నాయకత్వంలో రాజధాని అమరావతిని రూ.59వేల కోట్లతో నాలుగేళ్లలోపు పూర్తి చేసేందుకు కృషి జరుగుతోందని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు చెప్పారు.చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో సోమవారం స్వచ్ఛాంధ్ర జిల్లాస్థాయి అవార్డుల ప్రదాన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకట్రావు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలను సక్రమంగా అమలు చేశామన్నారు.చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాకు 55 స్వచ్ఛాంధ్ర అవార్డులు వచ్చాయని, వచ్చే ఏడాదికి వాటి సంఖ్య వందకు చేరాలని ఆకాంక్షించారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ ముందు చూపున్న వ్యక్తి సీఎం చంద్రబాబు అన్నారు.కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ శానిటేషన్ విషయంలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపే విధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులకు, ఉద్యోగులకు, సిబ్బందికి, సంస్థలకు చెందిన 55 మందికి స్వచ్ఛాంధ్ర అవార్డులను అందజేశారు.మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర రెడ్డి, చిత్తూరు టౌన్ బ్యాంకు చైర్మన్ రమేష్ నాయుడు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆస్పత్రి విభాగం



చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి

స్వచ్ఛ స్కూళ్ల విభాగం



కేజీబీవీ, బైరెడ్డిపల్లె

స్వచ్ఛ హాస్టళ్ల విభాగం



గురుకుల విద్యాలయం, జీడీ నెల్లూరు మండలం

స్వచ్ఛ అంగన్వాడీ విభాగం



బందార్లపల్లె, రామకుప్పం మండలం

స్వచ్ఛ ఇండస్ట్రీస్ విభాగం



రేవాన్స్ ప్లాటెక్, చిత్తూరు

బాబు నమ్మకాన్ని వమ్ము చేయను

- పీకేఎం ఉడా చైర్మన్ సురేశ్‌బాబు



పీకేఎం ఉడా చైర్మన్‌గా ప్రమాణం చేస్తున్న బీఆర్ సురేశ్‌బాబు

మదనపల్లె టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు తనపై వుంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కుప్పం, పలమనేరు, మదనపల్లె అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు తెలిపారు. సోమవారం మదనపల్లెలోని పీకేఎం ఉడా కార్యాలయం వద్ద చైర్మన్‌గా బీఆర్ సురేశ్‌బాబు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా కుప్పం, చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సురేశ్‌బాబును సన్మానించారు. పీకేఎం ఉడా అధికారులు సురేశ్‌బాబు చేత ప్రమాణస్వీకారం చేయించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో పీకేఎం ఉడా నిధులన్నీ వారికిష్టం వచ్చిన రీతిలో ఖర్చు చేశారని, ఈసారి అలా కాకుండా అన్ని నియోజకవర్గాలకు సమానంగా కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేయిస్తామన్నారు.ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్,షాజహాన్‌బాషా, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం,మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారామ్ ప్రసంగించారు. అంతకుముందు బీఆర్ సురేశ్‌బాబును మదనపల్లె టీడీపీ నాయకులు పెరవలి నవీన్, నిరంజన్‌నాని, ఎన్.జగదీష్ గజమాలతో సత్కరించారు.కార్యక్రమంలో టీడీపీ నేతలు రాటకొండ బాబురెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, టౌన్‌బ్యాంకు వైస్ చైర్మన్ భాస్కర్, డైరెక్టర్లు నాదెళ్ల శివన్న, సోమశేఖర్, టీడీపీ నాయకులు సీడ్ మల్లికార్జుననాయుడు, కట్టా దొరస్వామి నాయుడు, సురేంద్ర యాదవ్, ఆర్‌జే వెంకటేశ్, బీజేపీ నాయకులు ఎన్.సేతు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వగ్రామానికి సీఎం

- సోదరుడి సంవత్సరీకంలో పాల్గొననున్న చంద్రబాబు



సీఎం ఇంటి వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్, నారా గిరీష్, రవినాయుడు

తిరుపతి/తిరుపతి(నేరవిభాగం/కలెక్టరేట్)/చంద్రగిరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మంగళవారం స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లెకు రానున్నారు. తన సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడి సంవత్సరీక కార్యక్రమంలో పాల్గొననున్నారు. దీనికోసం ఆయన హెలికాప్టర్‌లో ఉదయం 11 గంటలకు చంద్రగిరి మండలం ఎ.రంగంపేటకు చేరుకుంటారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన నారావారిపల్లె వెళ్లనున్నారు. 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు.. నారావారిపల్లెలో గడుపుతారు. తన నివాసంలో సోదరుడి సంవత్సరీకానికి సంబంధించిన పూజల్లో పాల్గొంటారు. అనంతరం కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువులతో కలసి రామ్మూర్తినాయుడు సమాధిని సందర్శించి నివాళులర్పిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరి ఎ.రంగంపేట హెలిపాడ్‌కు చేరుకుని తిరుగు ప్రయాణమవుతారు. కాగా, సోమవారం ఉదయం నారా రామ్మూర్తి నాయుడి సతీమణి నారా ఇందిర, ఆయన పెద్ద కుమారుడు నారా గిరీష్, మధ్యాహ్నం చిన్న కుమారుడు, సినీ హీరో రోహిత్, సాయంత్రం 6 గంటలకు సీఎం సతీమణి భువనేశ్వరి నారావారిపల్లెకు చేరుకున్నారు. మంత్రి నారా లోకేశ్ రాత్రి నారావారిపల్లెకు వచ్చారు. మంగళవారం ఉదయం లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి, తనయుడు దేవాన్ష్ రానున్నారు. కాగా, సీఎం చంద్రబాబుతో పాటు ఆయన కుటుంబీకులు హెలికాప్టర్‌లో ఉండవల్లి వెళ్లనున్నారు. కాగా, 11వ నెల విస్తర కార్యక్రమ ఏర్పాట్లు పూర్తయ్యాయి. వ్యవసాయ పొలంలో రామ్మూర్తి నాయుడు ఘాట్ నిర్మించారు. కాగా, 10 వేలమందికిపైగా భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం ఇంటి సమీపంలో సంతాప సభ కోసం ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేశారు.


తిరుపతి విద్యార్థికి జాతీయ అవార్డు



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ద్వారా అవార్డు అందుకుంటున్న రెడ్డిజీష్ణు

చిత్తూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థి డి.రెడ్డిజీష్ణు.. జాతీయ స్థాయి ఉత్తమ సేవా అవార్డును ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులు మీదుగా సోమవారం అందుకున్నారు. ఎన్ఎస్ఎస్ 2022-23 సంవత్సరానికి వలంటీర్ విభాగంలో ఈ అవార్డు అందుకున్నారు. ప్రస్తుతం చిత్తూరు అపోలో యూనివర్సిటీలో ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్నట్లు అపోలో యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఇతను ఆరోగ్య అవగాహన, పర్యావరణ సంరక్షణ, రక్తదానం, గ్రామాల్లో శుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారని వివరించింది. అలాగే 11,130 మొక్కలు నాటినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా యూనివర్సిటీ వీసీ వినోద్‌భట్, రిజిస్ట్రార్ పోతురాజు తదితరులు కూడా విద్యార్థిని అభినందించారు.

అంబేడ్కర్ విగ్రహ ఘటనలో బొమ్మయ్యపల్లె సర్పంచ్ అరెస్టు



సర్పంచ్ గోవిందయ్య

చిత్తూరు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టకపోయినా.. పెట్టినట్లు సృష్టించిన బొమ్మయ్యపల్లెకు చెందిన వైసీపీ సర్పంచ్ గోవిందయ్యను కార్వేటినగరం పోలీసులు అరెస్టు చేశారు. సొంత ప్రయోజనాల కోసం అల్లర్లు సృష్టించి, శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తుషార్ హెచ్చరించారు. సోమవారం చిత్తూరులోని పోలీసు కార్యాలయంలో మీడియాకు వివరాలు తెలిపారు. ఈనెల మూడో తేదీన ఉదయం సుమారు రెండు గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దేవళంపేటలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని, ఆ విగ్రహానికి సమీపంలో ఉన్న టెంకాయ మట్టలతో కట్టిన ఒక షాపును పెట్రోల్ పోసి నిప్పంటించారని వెదురుకుప్పం పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఎస్ఐ అక్కడకు చేరుకుని శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. బొమ్మయ్యపల్లె పంచాయతీ సెక్రటరీ రాము ఇచ్చిన ఫిర్యాదుతో వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ నేతృత్వంలో కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, వెదురుకుప్పం ఎస్ఐతో కలిసి మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేశారు. సంఘటన స్థలంలో క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్, ఎఫ్ఎస్ఎల్ టీమ్స్ కొన్ని నమూనాలను సీజ్ చేశారు. అప్పుడే ఈ ఘటనలో సర్పంచ్ సి.గోవిందయ్య హస్తముందని సాంకేతికత ఆధారంగా నిర్ధారించారు. అంతేకాకుండా గుర్తు తెలియని వ్యక్తులు చిల్లర అంగడికి నిప్పు పెట్టారని మిన్నెల అనే మహిళ సర్పంచ్‌కు సమాచారం అందించింది. సర్పంచ్ అక్కడికి చేరుకుని, మిన్నెలకు లబ్ధి చేకూర్చేలా ఆమెతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. తనకు ప్రతి విషయంలోనూ అడ్డు తగులుతున్న టీడీపీ నేత సతీష్ నాయుడిపైకి నేరాన్ని తోసి స్వలాభం పొందాలని భావించాడని విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం కార్వేటినగరం బస్టాప్ వద్ద గోవిందయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

తిరుమలలో నేడు పున్నమిగరుడసేవ

తిరుమల, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం పున్నమి గరుడసేవ జరుగనుంది. సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో 28న గరుడవాహనంపై దర్శనమిచ్చిన శ్రీవారు పదిరోజుల వ్యవధిలోనే మరోసారి గరుడునిపై కొలువుదీరి దర్శనమివ్వనున్నారు. మంగళవారం రాత్రి7 నుంచి 9గంటల నడుమ ఊరేగింపు జరుగుతుంది.

ఘాట్‌లో అదుపుతప్పిన జీపు

● ఎనిమిది మందికి గాయాలు

తిరుమల, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో సోమవారం ఓ జీపు అదుపుతప్పి క్రాష్‌బారియర్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో ఎనిమిదిమంది గాయపడ్డారు. తిరుమల శ్రీవారి దర్శనం ముగించుకుని జీపులో తిరుపతికి వసప్తుండగా 24వ మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. జీపులోని నలుగురు హిందూపురం భక్తులు, ఇద్దరు ఒడిస్సా రాష్ట్రవాసులు, ఓ తమిళ భక్తుడితో పాటు తిరుపతికి చెందిన డ్రైవర్ గాయపడ్డారు.వీరిని 108 అంబులెన్స్ ద్వారా తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.





ప్రమాదానికి గురైన జీపు - ప్రమాదానికి గురైన జీపు, డ్రైవర్



అంబులెన్స్‌లో క్షతగాత్రులు


సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ దాటి బాటగంగమ్మ ఆలయ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.89 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 83,412

తలనీలాలు సమర్పించినవారు: 33,058



నాన్ మెడికల్ నియామకాలపై మౌనమేల?

● 15నుంచి ఇంటర్వ్యూలకు కసరత్తు

● కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు ● నాన్ మెడికల్ అభ్యర్థులకు నో కాల్

తిరుపతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని స్విమ్స్‌లో ఫ్యాకల్టీ నియామక ప్రక్రియపై ఎంపిక కమిటీ కసరత్తు మొదలుపెట్టింది. నోటిఫికేషన్‌లోని 104 పోస్టులకుగాను 315 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించి సుమారు 210 మందికి కాల్ లెటర్లు పంపినట్టు తెలిసింది. ఈనెల 15నుంచి 17వరకు రోజుకు 70 మంది చొప్పున ఇంటర్వ్యూకు పిలిచినట్టు సమాచారం. అయితే నాన్ మెడికల్ అభ్యర్థులకు కాల్ లెటర్లు అందలేదు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్ వంటి నాన్-మెడికల్ పోస్టులకు ఇదేవిభాగాలకు సంబంధించి స్విమ్స్ వర్సిటీలోనే పీజీ, పీహెచ్‌డీ చేసిన అభ్యర్థులను పక్కనపెట్టడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే, డెంటిస్ట్రీలోని ఓరల్ అండ్ మాక్సిల్లోఫేసియల్ సర్జరీ పోస్టుపై వచ్చిన ఆరోపణలపై వాటిని తాత్కాలికంగా హోల్డ్‌లో పెడుతున్నట్టు స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ మీడియా అడిగితే చెప్పారు కానీ అధికారిక వెబ్‌సైట్‌లోనూ, అధికారిక ప్రకటనగానూ విడుదల చేయలేదు. దీని వల్ల అభ్యర్థుల్లో అనుమానాలు మరింత పెరిగాయి.

గతంలోనూ ఇలా...

2023 నియామకాల సమయంలోనూ ఇదే పరిస్థితి చోటు చేసుకుంది. అప్పట్లో నాన్-మెడికల్ ఫిజియాలజీ పోస్టుపై కోర్టు ఆదేశాలు వచ్చినప్పటికీ, స్విమ్స్ ఆ పోస్టును మాత్రమే నిలిపివేసి మిగతావన్నీ భర్తీ చేసింది. అప్పట్లో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ అర్హతలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చినా, అమల్లో మాత్రం ఎంబీబీఎస్, ఎండీ ఆధారిత అభ్యర్థులకే ప్రాధాన్యమిచ్చారు. తాజా నోటిఫికేషన్‌లో ఎమ్మెస్సీ పీహెచ్‌డీ అర్హతలను పూర్తిగా నిరాకరించడం అభ్యర్థుల్లో నిరాశ, అభ్యంతరాలు రేపుతోంది. ఒక వైపు నియామకాలను వేగంగా నడిపిస్తూ, మరో వైపు కీలక విషయాల్లో స్పష్టత ఇవ్వకుండా ఉండటం వల్ల స్విమ్స్‌లో డ్యుయల్ మేనేజ్‌మెంట్ కొనసాగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నాన్ మెడికల్ అంటే ఎందుకంత చిన్నచూపు

ఎండీ చేసిన అభ్యర్థి స్విమ్స్‌లో అడహక్ కింద చేరిన ఏడాదికే పర్మినెంట్ అయిపోతున్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో ఓ సీనియర్ స్టాటిస్టీషియన్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదా ఇవ్వకుండా అడ్డంకులు పెడుతున్నట్టు తెలుస్తోంది. పీహెచ్‌డీ చేసిన సదరు స్టాటిస్టీషియన్‌కు ఎన్ఎంసీ నిబంధనల మేరకు అర్హత ఉన్నప్పటికీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించడంలేదు. దీనిపై ఆమె అలుపెరగని పోరాటం చేస్తున్నారు. స్టేట్ యాక్ట్‌తో నడుస్తున్న స్విమ్స్ సంస్థ యాజమాన్యం ఇష్టానుసారంగా నియామకాలు చేపట్టాలనుకోవడం సరికాదని అభ్యర్థులు వాపోతున్నారు.

'బెల్టు' తీస్తున్నారు

● అక్రమ మద్యంపై ఉక్కుపాదం ● నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు

● ఆర్నెళ్లలో వందకుపైగా కేసుల నమోదు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం బెల్టు దుకాణాల కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోంది. ఏమాత్రం తేడా వచ్చినా అధికార యంత్రాంగం ఉక్కు పాదం మోపుతోంది. ఎంఆర్‌పీ ధరకు మించి విక్రయించినా, గ్రామాల్లో బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసినా, నాసిరకం అంటగట్టినా జరిమానాలతో సరిపెట్టకుండా లైసెన్సులు రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈక్రమంలోనే జిల్లాలో గడచిన ఆరు నెలల్లో ఎక్సయిజ్ అధికారులు సుమారు వందకు పైగా కేసులు నమోదు చేశారు. జిల్లాలో 11 ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. వీటిలో తిరుపతి, తిరుపతి రూరల్, పరిధిలో అత్యధిక షాపులున్నాయి. అన్ని సర్కిళ్లలో ప్రత్యేక టీముల అధికారులు అమ్మకాల తీరుపై ప్రత్యేక నిఘా పెట్టారు. మద్యం దుకాణాలతో పాటు ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన బార్లలోనూ తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ఏ పరిస్థితుల్లోనూ రాజీ పడరాదనే సీఎం ఆదేశాలను తూ.చా.తప్పకుండా క్షేత్ర స్థాయిలో అమలు చేస్తున్నారు. ప్రధానంగా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, నాటుసారా, కల్లు, ఇతర మత్తు పదార్థాలు పొరుగురాష్ట్రాల నుంచి రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. బెల్టు షాపులపైనా సగటున నెలకు 20 కేసులు నమోదు చేస్తున్నారు. ఎంఆర్‌పీ ధర ఉల్లంఘనలు అతిక్రమించకుండా ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు ప్రత్యేక దృష్టి సారించారు. మద్యం నాణ్యత పరిశీలనకు 13 పారామీటర్లను అనుసరిస్తున్నారు.

ఎవ్వరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదు



నాసిరకం మద్యం, బెల్టు షాపుల విషయంలో కఠినంగా ఉంటున్నాం. నిరంతర నిఘా పెట్టాం. ఎంఆర్‌పీ ధరలకు మించి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులందితే సీరియస్‌గా పరిగణిస్తున్నాం. ఇప్పటికే మద్యం దుకాణాల యజమానులకు మార్గదర్శకాలు జారీ చేశాం.. డిపో నుంచి వచ్చిన మద్యం, దుకాణాల్లో బాటిళ్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. ఒకటికి రెండు సార్లు చెప్పిగా వినకపోతే షాపుల లైసెన్సుల రద్దుకు వెనుకాడేదిలేదు

- నాగమల్లేశ్వర రెడ్డి,జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

బాంబులు.. ఎప్పుడైనా పేలొచ్చు

● వ్యవసాయ కళాశాలకు బెదిరింపు మెయిల్

● అంతా ఫేక్ అని తేల్చిన పోలీసులు



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతికి బాంబు బెదిరింపు మెయిల్స్ ఆగడం లేదు. మళ్లీ మళ్లీ అగంతకుడు ఇదే తరహా మెయిళ్లు పంపుతూనే ఉన్నారు. ఈసారి తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాలలో ఐఈడీ ఆర్‌డీఎక్స్ బాంబులు పెట్టామని, ఎప్పుడైనా పేల్చుతామని బెదిరిస్తూ ఆదివారం అర్ధరాత్రి మెయిల్ పంపారు. అధికారుల ఫిర్యాదుతో తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు, ఎస్ఐలు, బాంబు డిస్పోజల్.. డాగ్ స్క్వాడ్‌లు ఏఎస్ఐ రమేష్, చాంద్ బాషా, బీరయ్య, సిబ్బంది తదితరులు సోమవారం ఉదయం నుంచి మూడు గంటల పాటు కళాశాలలో తనిఖీలు చేపట్టారు. సీఎం చంద్రబాబు మంగళవారం నారావారిపల్లెకు వస్తుండడంతో ఈ మెయిల్ వచ్చిన క్రమంలో అధికారులు అప్రమత్తమయ్యారు. కాగా, ఇలాంటి మెయిల్స్ ఎక్కడ నుంచి వస్తున్నాయి? దీని వెనుక ఎవరున్నారనే దానిపై పోలీసు యంత్రాంగం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది.

పీహెచ్‌డీ ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

● దరఖాస్తుకు 21వ తేదీ గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2024-25 పేర ఈ నోటిఫికేషన్ విడుదల చేశారు.ఏపీఆర్‌సెట్-2024-25 నిర్వహణ బాధ్యతను పద్మావతి మహిళా యూనివర్సిటీకి ప్రభుత్వం అప్పగించింది. దరఖాస్తుకు ఈనెల 21వ తేదీ చివరి గడువు విధించారు. ఎస్సీ ఎస్టీలకు రూ.1000, బీసీలకు రూ.1300, ఓసీలకు రూ. 1500 దరఖాస్తు రుసుం నిర్ణయించారు. నవంబరు 3నుంచీ 7వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని 14 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఏపీఆర్‌సెట్-2024-25 కన్వీనర్ ప్రొఫెసర్ ఉష, కో-కన్వీనర్ ప్రొఫెసర్ జాన్ సుష్మ తెలిపారు.

'ఎర్ర'స్మగ్లర్‌కు మూడేళ్ల జైలుశిక్ష : రూ.20వేల జరిమానా



ముద్దాయిని సబ్ జైలుకు తరలిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం)/పిచ్చాటూరు, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.20 వేలు జరిమానా విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. నారాయణవనం మండలం ఇరకంబట్టు గ్రామానికి చెందిన టి.సురేష్ 2015లో కేవీబీపురం మండల పరిధిలోని నిషేధిత రిజర్వు ఫారెస్టులోకి చొరబడి ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు తరలిస్తుండగా పిచ్చాటూరు పోలీసులు అరెస్టు చేశారు.కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.పదేళ్లుగా విచారణలో ఉన్న ఈ కేసును ఇటీవల తిరుపతి ఎర్రచందనం కోర్టుకు మార్చారు. పోలీసులు సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించడంతో న్యాయమూర్తి జైలుశిక్షతోపాటు జరిమానా విధించారు. ముద్దాయిని చిత్తూరు సబ్‌జైలుకు తరలించారు.

టీడీపీ నేతపై వైసీపీ సర్పంచ్ దౌర్జన్యం

● నీటిపారుదలశాఖ అధికారుల సాక్షిగా దాడికి యత్నం

● బాధితుడు వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్

తడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల బరితెగింపు దాడులు ఆగడం లేదు. సాక్ష్యాత్తు నీటిపారుదలశాఖ అధికారుల సాక్షిగా టీడీపీ నేతపై వైసీపీ సర్పంచ్ దాడికి దిగిన ఘటన తడ మండలంలో సోమవారం జరిగింది. మండలంలోని పూడి చెరువు మరమ్మతులు చేయాలని నీటిపారుదలశాఖ అధికారులు నిర్ణయించారు. ఆ శాఖ ఈఈతో పాటు ఏఈల కూడిన అధికారుల బృందం సోమవారం మధ్యాహ్నం చెరువును పరిశీలించింది. వారితో పాటు వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కొలవి సెల్వం కూడా ఉన్నారు. అదే సమయంలో వైసీపీ నాయకుడు, పూడి సర్పంచ్ ఓబులాపురం పరమశివం కుమారులు విశ్వనాథన్, శివకుమార్ అక్కడకు వచ్చి కొలవి సెల్వంతో గొడవకు దిగారు. బూతులు తిడుతూ దాడి చేశారు. దీంతో బిత్తరపోయిన సెల్వం కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న గ్రామస్తులు వచ్చి దాడిని అడ్డుకున్నారు. ఈదంతా చూస్తున్న అధికారులు నిశ్చేష్టులై నిలబడిపోయారు. ఈ ఘటనపై బాధితుడు సెల్వం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాతకక్షలను దృష్టిలో ఉంచుకొని తనపై అకారణంగా దాడిచేసి కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



గల్లంతైన బాలుడు కోసం పులికాట్‌లో గాలిస్తున్న మత్స్యకారులు



విషాదంలో యువకుడి బంధువులు

పడవలో నుంచి జారి..

పులికాట్ సరస్సులో బాలుడి గల్లంతు

● తీవ్రంగా గాలిస్తున్న మత్స్యకారులు

తడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సులో పడవలో వెళ్తున్న ఓ బాలుడు అదుపుతప్పి నీళ్లలో పడి గల్లంతయ్యాడు. తడ మండలం ఇరకందీవికి చెందిన తెరిగిపి ఆర్ముగం కుటుంబం తమిళనాడు ఎన్నూరుకుప్పం గ్రామానికి వెళ్లి అక్కడే నివాసం ఉంటోంది. పెరటాసి నెల 3వ శనివారం నాడు కుటుంబంతో సహా గ్రామానికి వచ్చారు. సోమవారం ఉదయం తమిళనాడులోని సున్నాంబకులం వెళ్లేందుకు ఆర్ముగం తన మనవడు తెరిగిపి హేమరాజ్(17) కలిసి పడవలో బయలుదేరారు. పులికాట్ సరస్సులో కొంత దూరం వెళ్లాక అల్లల ఉధృతికి పడవ అటు ఇటు ఊగడంతో అంచుపై కూర్చున్న హేమరాజ్ అదుపుతప్పి నీళ్లల్లో పడిపోయాడు. పడవలో ఉన్న ప్రయాణికులు గాలించినా ఆచూకీ దొరక్కపోవడంతో ఇరకందీవి గ్రామస్తులకు సమాచారం అందించారు. దీంతో మత్స్యకారులు పడవల్లో బయలుదేరి ఘటనాస్థలికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు కూడా ఘటనాస్థలికి వెళ్లారు. రాత్రి వరకు గాలించినా హేమరాజ్ ఆచూకీ దొరకలేదు. చీకటి పడటంతో గాలింపు చర్యలు ఆపేసి.. మంగళవారం ఉదయం మొదలు పెట్టనున్నారు.



చేతిలో కత్తి పెట్టుకుని వీరంగం చేస్తున్న ఫిరోజ్

మద్యంతాగి.. కత్తితో వీరంగం

● తిరుపతిలో ఇద్దరిని అరెస్టు చేసి.. వీధిలో నడిపించుకుంటూ వెళ్లిన పోలీసులు



నిందితులను రోడ్డుపై తీసుకెళుతున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రౌడీ కల్చర్ కోరలు చాచింది. ఓ రౌడీ మద్యం మత్తులో కత్తితో వీరంగం చేస్తూ నడిరోడ్డుపై సోమవారం జనాలను భయభ్రాంతులకు గురిచేశాడు. ఇతడితోపాటు ప్రత్యర్థినీ పోలీసులు అదుపులోకి తీసుకుని వీధిలో నడిపించుకుంటూ తీసుకెళ్లారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తిరుపతి నగరం ఎస్టీవీ నగర్‌కు చెందిన ఫిరోజ్, సయ్యద్ బాషా కొన్నేళ్లుగా పాత కక్షలున్నాయి. గతంలో వీరిద్దరూ కత్తులతో పొడుచుకుని హత్యాయత్నాలకు పాల్పడ్డారు. జైలుకూ వెళ్లి వచ్చారు. ఫిరోజ్ రౌడీలా తిరుగుతూ, స్నేహితులతో గలాటాలకు దిగి బెదిరించడం పరిపాటిగా మారింది. ఇతడిపై దాదాపు 19 కేసులు ఉన్నాయని, ఇది వరకే రౌడీ షీట్ నమోదై ఉందని ఈస్ట్ సీఐ శ్రీనివాసులు చెప్పారు. అడ్డగోలు సంపాదనకు అలవాటు పడ్డ సయ్యద్ బాషా, ఫిరోజ్ మధ్య ఆర్థిక లావాదేవీలు, ఇతర వ్యవహారాల్లో తీవ్ర గొడవలున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఎస్టీవీ నగర్‌లోని విక్టరీ వైన్స్ వద్ద ఫిరోజ్ మద్యం తాగి, చేతిలో కత్తి పెట్టుకుని వీరంగం చేశాడు. బాగా తెలిసిన వారికి కత్తి చూపిస్తూ భయభ్రాంతులకు గురిచేశాడు. అదే షాపు వద్ద సయ్యద్ బాషా కూడా మద్యం తాగుతున్నాడు.ఈ క్రమంలో ఫిరోజ్ వీడియోలు సోషల్ మీడియాల్లో వైరల్ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. డీఎస్పీ భక్తవత్సలం ఆదేశాలతో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హేమాద్రి, సిబ్బంది అక్కడికి వెళ్లారు. నడి రోడ్డుపై కత్తి పెట్టుకుని వీరంగం చేస్తున్న ఫిరోజ్‌ను, అక్కడే ఉన్న సయ్యద్‌బాషాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల ఎస్టీవీ నగర్‌లో జరిగిన రెండు ఘటనల్లోనూ ఫిరోజ్ హస్తం ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కాగా, ఫిరోజ్, సయ్యద్‌బాషాపై ఆర్మ్స్ యాక్టు కింద కేసు నమోదు చేసి ఈస్ట్ స్టేషన్ నుంచి వీధుల్లో నడిపించుకుంటూ కోర్టు వద్దకు తీసుకెళ్లారు. న్యాయమూర్తి వారికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ శ్రీనివాసులు చెప్పారు. గత కొంత కాలంగా పోలీసుల రికార్డుల్లోకెక్కిన రౌడీల పట్ల పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడం, వారి కదలికలపై నిఘా ఉంచి చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా వీరిపట్ల కఠిన వైఖరి అవలంబించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులే భావి శాస్త్రవేత్తలు

● ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో షార్ డైరెక్టర్ పద్మకుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్

సూళ్లూరుపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకుంటే ఇస్రోకు భావి శాస్త్రవేత్తలుగా ఎదగవచ్చని షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అన్నారు. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో సోమవారం ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వారిని శాస్త్రవేత్తలుగా తీర్చి దిద్దేందుకు ఇస్రో ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగానే ఏటా అక్టోబరు 4 నుంచి 10వ తేదీ వరకు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాలు, వాటి పనితీరుపై అవగాహన కల్పించి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది ఏపీతో పాటు తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో కూడా ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతరిక్ష ఫలాలు సామాన్యులకు సైతం అందేలా ఇస్రో కృషి చేస్తోందన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పూణెలోని ఇంటర్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ రఘునాథన్ శ్రీఆనంద్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్సు రంగం పట్ల పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుంటే శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. మన శాస్త్రవేత్తలు తక్కువ ఖర్చుతోనే చంద్రయాన్, మంగళయాన్, ఆదిత్యా-ఎల్ 1 వంటి ప్రయోగాలు చేపట్టడం దేశానికే ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో షార్ అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చెరియన్, షార్ కంట్రోలర్ జి.రమేష్ బాబు, అంతరిక్ష వారోత్సవాల కమిటీ చైర్మన్ శంబు ప్రసాద్, రేంజ్ ఆపరేషన్ డైరెక్టర్ ఎస్.సునీల్, ఎంఎస్‌ఏ డీడీ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చలపతిరావును శాలువా కప్పి ఆహ్వానిస్తున్న అధికారులు

స్మగ్లర్లు అడవుల్లోకి రాకుండా చర్యలు

అటవీ శాఖ అధికారులతో పీసీసీఎఫ్ చలపతిరావు

మంగళం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్మగ్లర్లు అడవుల్లోకి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్టు పీవీ చలపతిరావు అటవీ, టాస్క్‌ఫోర్సు అధికారులకు సూచించారు. తిరుపతి బయోట్రిమ్‌లో సోమవారం తిరుపతి, కర్నూలు సర్కిళ్ల అటవీశాఖ, ఏపీ టాస్క్‌ఫోర్సు అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన ఏపీ టాస్క్‌ఫోర్సు, అటవీ శాఖ బలగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న దుంగలను ఎప్పటికప్పుడు గోదాములకు తరలించి, భద్రపరచాలన్నారు. ఎర్రచందనం సాగు, లోకల్ మార్కెట్‌లో విక్రయాలపై దృష్టి సారించాలని సూచించారు. ఎర్రచందనం బొమ్మలు, ఇతర వస్తువుల తయారీ, మార్కెటింగ్ వంటి అంశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్కిల్ సీసీఎఫ్ సెల్వం, కర్నూలు సర్కిల్ సీసీఎఫ్ కృష్ణమూర్తి, టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి తిరుపతి సుబ్బరాయుడు, టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్, డీఎఫ్‌వో పవన్‌కుమార్ రావు, ఎర్రచందనం గోదాము రవిశంకర్‌శర్మ, తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో కొండారెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ సహకార సదస్సు

● వివిధ రాష్ట్రాల నుంచి 80 మంది డెలిగేట్స్ రాక

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సహకార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తిరుపతి తాజ్ హోటల్ వేదికగా బుధవారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సహకార రంగాల ఐఏఎస్ అధికారులు, ప్రతినిధులు హాజరుకానున్నారు. మంగళవారం డెలిగేట్స్ తిరుపతికి చేరుకోనున్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ హాజరుకానున్నారు. ఆయా రాష్ట్రాల్లోని సహకార రంగంలో అమలవుతున్న సంస్కరణలు, వివిధ అంశాలపై ఎగ్జిబిషన్ ఉంటుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. జాతీయ సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్‌బూటానీ, జాయింట్ సెక్రటరీ సిద్ధార్థ్‌జైన్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ పర్యవేక్షణలో ఈ సదస్సు జరుగుతుంది.

9నుంచి ఎస్వీయూ ఇంటర్ కాలేజీ గేమ్స్‌కు ఎంపిక

తిరుపతి(క్రీడలు), అక్టోబర్ 6(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంటర్ కాలేజీ మెన్ అండ్ ఉమెన్ గేమ్స్‌కు క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 9వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఎస్వీయూ వ్యాయామ విభాగాధిపతి ఎం.శివశంకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. 9న బాక్సింగ్, జూడో, కరాటే, తైక్వాండో, సాఫ్ట్‌బాల్, బాస్కెట్‌బాల్ పురుష క్రీడాకారుల ఎంపిక, 14, 15 తేదీల్లో బాస్కెట్‌బాల్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, హాకీ, క్రికెట్‌కు సంబంధించి మహిళా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఎస్వీయూలో జరుగుతాయని వెల్లడించారు. 17, 18 తేదీల్లో ఫుట్‌బాల్, హాకీ, బాల్‌బ్యాడ్మింటన్ పురుష క్రీడాకారుల ఎంపిక పోటీలు ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాలలో ఉంటాయని పేర్కొన్నారు. 22, 23 తేదీల్లో ఖోఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్ పురుష క్రీడాకారుల ఎంపిక పోటీలు ఎస్వీయూలో నిర్వహిస్తారని తెలిపారు. 29, 30 తేదీల్లో చెస్, బ్యాడ్మింటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్ పురుష క్రీడాకారుల ఎంపిక పోటీలు మదనపల్లెలోని శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ మైదానంలో జరుగుతాయన్నారు. నవంబర్ 4, 5తేదీల్లో మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలకు సంబంధించిన ఎంపిక పోటీలు ఎస్వీయూలో, అదేనెల 18న మెన్ క్రికెట్ పోటీలు ఎస్వీయూ మైదానంలో ఉంటాయని తెలిపారు. చివర్లో ఎస్వీయూ ఇంటర్ కాలేజీ మెన్ అండ్ ఉమెన్ స్టాఫ్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు వివరించారు.

ఎన్‌జీవో విభాగంలో స్వచ్ఛాంధ్ర అవార్డు



పలమనేరు పరిరక్షణ సమితి



నేచరల్ లవర్స్ అసోసియేషన్స్, చిత్తూరు

బెస్ట్ స్వచ్ఛతా వారియర్స్ విభాగం



సావిత్రి, కార్వేటినగరం

విలేజ్ ఆర్గనైజేషన్స్ విభాగం



ఏకార్లపల్లె, కుప్పం మండలం

మహిళా సమాఖ్యల విభాగం



ఆంజనేయ మహిళా సమాఖ్య, నగరి

కల్తీ మద్యానికి మూల విరాట్ జగన్ రెడ్డి

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యానికి మూల విరాట్ మాజీ సీఎం జగన్ రెడ్డి అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ ఆరోపించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో కల్తీమద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ నాయకులు దాసరి జయచంద్రారెడ్డి, కట్టా సురేంద్ర నాయుడిని పార్టీ సస్పెండ్ చేసి, సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఇది కూటమి ప్రభుత్వం, టీడీపీ నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. ఎవరో, ఎక్కడో తప్పుచేస్తే దాన్ని ప్రభుత్వానికి, పార్టీకి అంటగట్టేలా వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. వాస్తవాలను వక్రీకరించి.. జగన్ మద్యం కుంబకోణంలో కొండంత దోపిడీని కప్పి పెట్టుకునే కుట్ర చేస్తోందన్నారు. అతి పెద్ద మద్యం కుంభకోణం కేసులో నిందితులుగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిలను జగన్ రెడ్డి ఎందుకు సస్పెండ్ చేయలేదో ప్రజల చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ పాలనలో జరిగిన కల్తీ మద్యం, బెల్టుషాపుల గురించి ప్రజలకు బాగా తెలుసన్నారు. అటువందిది వైసీపీ నేతలు మద్యం గురించి మాట్లాడటం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవ చేశారు. ● ఎవరైనా తప్పు చేస్తే సీఎం చంద్రబాబు వదిలిపెట్టరని, అది తమ పార్టీ వారైనా చర్యలు తీసుకుంటారని తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని ఇప్పటికే పార్టీ నుంచి సస్పెండ్ చేసి, విచారణకు ఆదేశించడం జరిగిందన్నారు.

ట్రాక్టర్ల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు



నిందితుల వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

గుడిపాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ల చోరీ కేసులో ముగ్గురిని అరెస్టు చేశారు. రెండు ట్రాక్టర్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రాంమోహన్ సోమవారం మీడియాకు వివరాలు తెలిపారు. జూలై 21వ తేదీ రాత్రి సమయంలో గుడిపాల మండలం పశుమందకు చెందిన వినాయకం అనే రైతుకు చెందిన ట్రాక్టర్‌ను, సెప్టెంబరు 30న కృష్ణజిమ్మాపురానికి చెందిన చిట్టిబాబునాయుడు అనే రైతుకు చెందిన ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ తుషార్ ఆదేశాలతో చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు పర్యవేక్షణలో గుడిపాల పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చోరీకి గురైన రెండు ట్రాక్టర్లు తమిళనాడు వైపు వెళ్లినట్లు గుర్తించారు. ఈ క్రమంలో తమిళనాడు సరిహద్దులో వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు ట్రాక్టర్లు, ఓ ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురు పోలీసులను చూసి పారి పోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి పట్టుకున్నారు. విచారించాక వారి వద్ద నుంచి రెండు ట్రాక్టర్లు, ఓ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. అలాగే తమిళనాడుకెళ్లి మరో ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారిలో తమిళనాడు రాష్ట్రం కాట్పాడి మండలం కోదండరామాపురానికి చెందిన బద్రీ, కార్తీక్, పరుత్తిపాడుకు చెందిన రాజమణిగా గుర్తించి, అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌కు స్వచ్ఛ అవార్డు

చిత్తూరు రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ అవార్డులో చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌కు రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డు లభించింది. బస్టాండ్‌లో పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాల్లో ఈ అవార్డు లభించినట్లు డీపీటీవో రాము తెలిపారు. చిత్తూరు ఆర్టీసీకి రాష్ట్ర స్థాయి అవార్డు లభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇదే విధంగా బస్టాండ్‌ను నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

గ్యాంగ్‌రేప్ నిందితులకు సహకరించొద్దు

న్యాయవాదులకు సీపీఐ నేతల విజ్ఞప్తి



చిత్తూరు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బాలికపై గ్యాంగ్‌రేప్ చేసిన నిందితులకు న్యాయవాదులు సహకరించొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ విజ్ఞప్తి చేశారు. న్యాయవాదులు మానవతా దృక్పథంలో ఆలోచించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ముందు నినాదాలు చేశారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు మొత్తం 274 అర్జీలు అందాయి. వీటిల్లో.. రెవెన్యూ, సర్వేశాఖకు 177, డీఆర్‌డీఏకు 21, ఏపీఎస్‌పీ డీసీఎల్‌కు 10, పోలీసుశాఖకు 5, పంచాయతీరాజ్‌శాఖకు 4 అర్జీలు రాగా.. ఉద్యానశాఖ, డీపీవో, హౌసింగ్, డ్వామా, డీసీహెచ్ఎస్, ఎంప్లాయిమెంట్‌శాఖ, ట్రైబల్ వెల్ఫేర్, ఆర్‌అండ్‌బీ, రిజిస్ట్రేషన్, ఎస్ఎస్, విద్యాశాఖ, వ్యవసాయశాఖలకు కలిపి 57 అర్జీలు అందాయి. బాధితుల నుంచి అర్జీలను కలెక్టర్‌తోపాటు ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడేల్, డీఆర్వో మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, తదితరులు స్వీకరించారు.

మా భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

మా భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని శాంతిపురం రాళ్లబూదుగూరుకు చెందిన చలపతి కోరారు. సర్వే నెంబరు206లో 2.40 ఎకరాలు, 207లో 0.64 సెంట్ల భూమి ఉందన్నారు. తన పూర్వీకుల నుంచి ఈ భూమి తమ అనుభవంలో ఉందన్నారు. ఈ భూమిని కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి తప్పుడు పట్టాలు సృష్టించి ఆక్రమించుకున్నాడని వాపోయారు. అడిగితే చంపేస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

మిగిలిన సీసీ రోడ్డు పూర్తిచేయండి

గతంలో గ్రామానికి సీసీ రోడ్డు వేశారని పాలసముద్రం మండలం దీనబంధుపురం ఆది ఆంధ్రవాడ గ్రామస్తులు తెలిపారు. అయితే ఇందులో 500 మీటర్ల దూరాన్ని వదిలేశారన్నారు. ఈ ప్రాంతంలో ఎగుడుదిగుడు మట్టిరోడ్డుతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

అనుభవ భూమికి పట్టాలివ్వాలి

తమ అనుభవంలోని భూములను సర్వే చేసి పట్టాదార్‌పాసుపుస్తకాలను ఇవ్వాలని పెద్దపంజాణి మండలం కొత్తబూరగపల్లె ఎస్టీ కాలనీకి చెందిన పలువురు కోరారు. సర్వే నెంబరు 88-10లో ఉన్న వ్యవసాయ భూములను 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఈ విషయంలో స్థానిక రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఒప్పంద జూనియర్ అసిస్టెంట్లుగా మార్చండి

జాతీయ ఆరోగ్యమిషన్ పథకం ద్వారా పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న తమను ఒప్పంద పద్ధతిపై జూనియర్ అసిస్టెంట్లుగా మార్పు చేయాలని డీటీపీ ఆపరేటర్లు కోరారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 51 అర్జీలు



జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 51 అర్జీలు వచ్చాయని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. వీటిల్లో చీటింగ్‌పై 2, కుటుంబ తగాదాలపై 8, వేధింపులపై 6, భూ తగాదాలపై 21, డబ్బులు తగాదాలపై 10, దొంగతనంపై ఒకటి, ఆస్తి తగాదాలపై 3 చొప్పున ఉన్నాయి.







ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట - కొబ్బరిచెట్టును పెకలించిన ఏనుగులు - ధ్వంసమైన వేరుశనగ పంట

పంటలపై కొనసాగుతున్న గజ దాడులు

కల్లూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని కమ్మపల్లి పంచాయతీలో ఆదివారం రాత్రి వరి, వేరుశనగ, మామిడిచెట్లపై ఏనుగుల గుంపు దాడి చేయడంతో అపారనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ నుంచి ఆదివారం రాత్రి బయలుదేరిన 9 ఏనుగుల గుంపు కమ్మపల్లి పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లి ఎస్సీ కాలనీ వద్దకు చేరుకున్నాయి. కాలనీలోని రైతులు కమలమ్మ, సహదేవయ్య, వెంకట్రమణకు చెందిన వేరుశనగ పంటను ఏనుగులగుంపు ధ్వంసం చేశాయి. బాలిరెడ్డిగారిపల్లిలోని రైతులు చెంగారెడ్డి, హైమావతి, సురేంద్రరెడ్డి, రుక్మిణమ్మ, నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డికి చెందిన వరి పంటలను ధ్వంసం చేశాయి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. హైమావతికి చెందిన కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో పెకలించాయి. అక్కడి నుంచి అడవిలోకి తిరుగుముఖం పట్టిన ఏనుగుల గుంపు మార్గంలోని పలువురు రైతుల మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ బోడబండ ద్వారా తూర్పు విభాగం అడవిలోకి చేరుకున్నాయి. సోమవారం పగలంతా చింతల వంక వద్ద ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు ప్రజలు తెలిపారు.

ఏనుగుల స్వైరవిహారం

వరి పంటల ధ్వంసం ● రైతుల కంట కన్నీరు



ఏనుగుల సంచారంతో వరిపైర్లు ధ్వంసం

సోమల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో మళ్లీ ఏనుగులు ప్రవేశించి వరి పంటలపై స్వైరవిహారం చేయడంతో రైతులు పంటలను కోల్పోయి ఆర్థికంగా నష్టపోయారు. ఆదివారం రాత్రి ఆవులపల్లె పంచాయతీలోని కొత్తూరు సమీపంలో ప్రవేశించిన మూడు ఏనుగులు టమోటా, మామిడి తోటల్లో సంచరించి ధ్వంసం చేశాయి. రెండు రోజులుగా ఏనుగులు సంచరిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న రైతులు టమోటా కోతలను ఆపేశారు. పత్రపల్లె రోడ్డుకు సమీపంలోని సుబ్రహ్మణ్యంరాజు, చలపతిరాజు, సంజీవి అనే రైతుల వరి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. తిరుపాల్ టమోటా తోటలు, మామిడి తోటల్లో ఏనుగులు సంచరించినట్లు రైతులు తెలిపారు. వరి, బొప్పాయి, అరటి తోటల్లో బీభత్సం సృష్టించాయి. పలువురి పొలాల్లోని డ్రిప్ పైపులను నాశనం చేశాయి. దీంతో మండలంలోని రైతులు రాత్రిపూట పొలాల వైపు వెళ్లడానికి భయపడుతున్నారు. ఏ రాత్రి ఏ పొలంలోకి వచ్చి పంటలను ధ్వంసం చేస్తాయోనని ఆందోళ చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు ఏనుగుల సంచారంపై నిఘా వేసి ప్రజలను అప్రమత్తం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చేతికి అందే పంటలను ఏనుగులు ధ్వంసం చేయడంతో ఆర్థికంగా దెబ్బతింటున్నామని రైతుల కంట కన్నీరు పెడుతున్నారు.

నింద్ర ఎంపీపీ బాధ్యతల స్వీకారం



ఎంపీపీ దుర్గాదేవితో రోజా తదితరులు

నింద్ర, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నింద్ర ఎంపీపీగా నాగినేని దుర్గాదేవి సోమవారం ఉదయం ఎంపీడీవో కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. వైస్ ఎంపీపీ-1 ఉన్న ఈమెను ఎంపీపీగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీలను మాత్రమే లోనికి అనుమతించాలని పోలీసులకు అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఎంపీపీ ప్రమాణ స్వీకారానికి మాజీ మంత్రి రోజా రావడంతో అధికారులు ఆమెను లోనికి అనుమతించలేదు. కొద్దిసేపు అధికారులు, రోజా మధ్య వాగ్వాదం జరిగింది. అయినప్పటికీ ఆమెను అనుమతించలేదు. దీనిపై ఆమె.. కలెక్టర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. చివరకు జిల్లా అధికారుల ఆదేశాలతో రోజాను ఎంపీడీవో అనుమతించారు. ఈ సందర్భంగా నూతన ఎంపీపీని రోజాతోపాటు కొప్పేడు ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, ఆరూరు ఎంపీటీసీ రమ్యలతో పాటు టీడీపీ సర్పంచ్‌లు, నాయకులు సన్మానించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నగరి రూరల్ సీఐ భాస్కర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.





మొరవను తెగ్గొట్టిన దృశ్యం - చెరువు నుంచి కాలువలో పోతున్న నీరు

మొరవను తెగ్గొట్టిన కాంట్రాక్టర్

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మొరవ పనులను దక్కించుకున్న వ్యక్తి కాసులకక్కుర్తితో నిండు జలాలతో కళకళలాడాల్సిన చెరువు కళావిహీనంగా వెలవెలబోనుంది. కర్ణాటకలో ఇటీవల కురిసిన వర్షాలతో అక్కడి నుంచి వచ్చిన వరదనీటితో శాంతిపురం మండలం సోగడబల్ల చెరువు నిండి రెండు రోజుల క్రితం మొరవపారింది. స్థానికంగా వర్షాభావంతో చెరువు ఎండిపోవడంతో భూగర్భజలాలు అడుగంటి సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టులో పంటలు సాగు చేస్తున్న రైతులు తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురయ్యారు. కర్ణాటకలో భారీ వర్షాల పుణ్యమా అని చెరువు నిండుజలాలతో కళకళలాడటంతో తమ బోర్లలో తగ్గిన భూగర్భజలాలు తిరిగి వృద్ధి చెందడంతో పంటలు సాగు చేసుకోవచ్చని వారు సంబరపడ్డారు. కానీ వారి సంతోషం కొన్ని రోజులు కూడా ఉండలేదు. చెరువు మొరవ మరమ్మతు పనులు దక్కించుకున్న వ్యక్తి కాసుల కక్కుర్తితో దారుణానికి ఒడిగట్టాడు. మొరవను తెగ్గొట్టి, కాలువ తవ్వించి చెరువులోని నీరంతా ఖాళీ అయ్యేలా చేశాడు. ఆ వ్యక్తి తవ్వించిన కాలువ ద్వారా జలాలు వెంకటేపల్లె చెరువుకు చేరాయి. మొరవ మరమ్మతు పనుల కోసం ఆ వ్యక్తి దారుణానికి ఒడిగట్టడంపై రైతులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మొరవ పటిష్ఠంగానే ఉందని, అయినా మరమ్మతులు చేపట్టాలనుకుంటే చెరువులో నీటిమట్టం తగ్గిన తర్వాత చేసుకోవచ్చని వారు తెలిపారు. మొరవను తెగ్గొట్టి, రైతులకు ఆదరువుగా వున్న చెరువులో నీటిని ఖాళీ చేసిన వ్యక్తిపై సంబందిత శాఖ అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వెంటనే మొరవకు మరమ్మతులు చేపట్టాలని కూడా వారు కోరారు.

పులివెందులలో ప్రజాదర్బార్ అర్జీలు ప్రభుత్వానికి పంపరా?

వాటిని జగన్ సొంత నిధులతో పరిష్కరిస్తారా? ● ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి రాని జగన్ పులివెందులకు వెళ్లి ప్రజాదర్బార్‌ను నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను తీసుకుంటున్నారని, ఆ అర్జీలను ప్రభుత్వానికి పంపకుండా సొంత నిధులతో ఏమైనా పరిష్కరిస్తారా అని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ప్రశ్నించారు. చిత్తూరులో సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.వైసీపీ తరపున 11మంది ఎమ్మెల్యేలుగా గెలిస్తే.. వారిలో నలుగురు కొత్త వారున్నారన్నారు. జగన్ తీసుకున్న నిర్ణయం కారణంగా ఆ నలుగురు ఎమ్మెల్యేలు అసెంబ్లీని చూడకుండానే వెళ్లిపోతారేమోనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తామంటున్నారని..మరి ఏ హోదా లేకుండా వాళ్లపార్టీకి చెందిన ఎంపీలు పార్లమెంటుకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు.ఓట్లు వేసిన ప్రజల కోసం అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై మాట్లాడాలి తప్ప.. ప్రతిపక్ష హోదా పేరుతో అసెంబ్లీకి రాకపోవడం దారుణమన్నారు.ఇప్పటికైనా జగన్ చౌకబారు ఆరోపణలు మాని అసెంబ్లీకి రావాలని సూచించారు.

ఆరో రోజుకు పీహెచ్‌సీ వైద్యుల ధర్నా



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యులు చేస్తున్న ధర్నా సోమవారంతో ఆరో రోజుకు చేరుకుంది. గ్రామీణ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక బకాయిలు చెల్లించాలి: పీఆర్‌టీయూ

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నన్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అధికారంలోకి వచ్చి 16 నెలల కావస్తున్నా, ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పీఎఫ్, ఏపీజీఎల్ఐ క్లెయిమ్స్ తదితర బకాయిలు రూ.36వేల కోట్లు ఉంటే కేవలం రూ.6 వేల కోట్లు మాత్రమే ప్రభుత్వం చెల్లించిందన్నారు. పీఆర్‌టీయూ ద్వారా ఉపాధ్యాయ సమస్యలపై గళాన్ని మండల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ప్రాతినిథ్యం చేసిందన్నారు. నాలుగు డీఏల విడుదల, 30 శాతం ఐఆర్ ప్రకటన, నూతన పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, 2018 నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలలో భాగంగా సరెండర్ లీవులు ఇతర క్లెయిమ్స్ చెల్లించడానికి ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని సూచించారు. డీఎస్సీ 2003లో నియామకమైన టీచర్లకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మమ్మ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీడీ నెల్లూరు మండలం పి.బి.అగ్రహారానికి చెందిన పుష్ప అనే మహిళ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గణేష్, పుష్ప దంపతులకు 20 ఏళ్లుగా గణేష్ తమ్ముడు మంజునాథ్‌తో గొడవలున్నాయి. ఈనేపథ్యంలో గతవారం మంజునాథ్.. బెల్టుషాపు నడుపుతున్నాడని కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఈ దంపతులు ఫిర్యాదు చేశారు. అంతకుముందు జీడీ నెల్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అంతేకాకుండా మంజునాథ్‌కు మద్దతుగా హెడ్‌కానిస్టేబుల్ దాము.. గణేష్, పుష్పలను దుర్భాషలాడి, బెదిరించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పుష్ప సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్ జరిగే సమయంలో వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెకు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వినతుల వెల్లువ



ఫిర్యాదు దారుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో భవాని

పలమనేరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పలమనేరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్డీవో పి.భవానీకి పెద్ద ఎత్తున అర్జీలు సమర్పించారు. భూరీసర్వే, పట్టాదారు పాసుపుస్తకాల్లో పొరబాట్లు, రేషన్ కార్డులు, పింఛన్లు తదితర సమస్యలపై పలువురు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. పలమనేరు ముత్తాచారిపాళ్యంలో కాపురమున్న లావణ్య తనకు, తన ఇద్దరు పిల్లలకు కలపి ప్రత్యేక రేషన్‌కార్డు ఇవ్వాలని కోరింది. రేషన్‌కార్డు లేనందున వితంతు ఫించన్ కూడా రావడం లేదని పేర్కొంది. పెద్దపంజాణి మండలం ఆకులవారిపల్లికి చెందిన గంగులమ్మ తాను తనభర్తకు మొదటి భార్యనని, ఆయన మరణానంతరం తన భర్త భూములకు పూర్తిగా తన సవతి కుమారులు పాసుపుస్తకాలు చేసుకొన్నారని తెలిపారు. దీంతో తాను, తన పిల్లలు ఎటువంటి భూములు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గంగులమ్మ ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది. ఈ సమస్యలపై విచారణ జరిపి చర్యలు తీసుకొంటామని ఆర్డీవో బాధితులకు హామీ ఇచ్చారు. బాధితుల నుంచి వచ్చిన మరికొన్ని ఫిర్యాదులను అప్పటికప్పుడే పరిష్కరించేందుకు ఆర్డీవో భవాని సంబంధిత మండల తహసీల్దార్‌లకు ఫోన్‌చేసి ఆదేశాలు ఇచ్చారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో బాలాలయ పూజలు



సుబ్రహ్మణ్యస్వామి మూల మూర్తికి జలాభిషేకం చేస్తున్న వేదపండితులు

రామకుప్పం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం బాలాలయ ప్రతిష్ఠ, కళాకర్షణ, హోమాలు నిర్వహించారు. త్వరలోనే ఆలయ పునర్నిర్మాణం పనులు ప్రారంభం కానుండటంతో నిర్వహకులు, వేదపండితులు సందీప్‌శర్మ, నాగరాజశర్మలు మధ్యాహ్నం రెండు గంటలకు హోమాలు నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్యస్వామి వారి మూల మూర్తికి జలాభిషేకం నిర్వహించి, మంగళహారతులిచ్చారు. సుబ్రహ్మణ్యస్వామి మూలమూర్తితోపాటు అక్కడి మహాగణపతి, వళ్లీ, దేవసేన, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలకు ప్రత్యేక మంత్రోచ్చారణల మధ్య కళాకర్షణ తంతును నిర్వహించారు. చివరగా విగ్రహాల నుంచి కలశాలలోకి కళాకర్షణ చేసిన అనంతరం ఆలయ ఆవరణలోని నాగులమ్మ ఆలయంలోకి చేర్చి పూజలు నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణం అయ్యేవరకు మూలమూర్తి దర్శనం ఉండదని, నాగులమ్మ దేవాలయంలో కలశాలకు నిత్యపూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

రూ.3.40కోట్లతో ఆలయ పునర్నిర్మాణం

2024 ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలోని ప్రధాన ఆలయాల పునర్నిర్మాణం చేపడతామని ప్రకటించారు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.3.40కోట్లు కేటాయించింది. కాగా శ్రావణమాసం లోపు నిర్మాణ పనులు పూర్తి చేసి, వార్షిక సోమవారోత్సవాలకు ఆలయం ముస్తాబవుతుందని కమిటీ పెద్దలు సీతాపతి తెలిపారు.

1230లీటర్ల మద్యం ధ్వంసం



మద్యం సీసాలను ధ్వంసం చేయిస్తున్న పోలీసు, ఎక్సైజ్ అధికారులు

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాళ్ళబూదుగూరు పోలీస్ స్టేషను పరిధిలో స్వాధీనం చేసుకున్న 1230లీటర్ల మద్యాన్ని సోమవారం పోలీసు, ఎక్సైజ్ అధికార్లు ధ్వంసం చేయించారు. కుప్పం డీఎస్పీ పార్థసారథి, రూరల్ సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్‌ఐ నరేష్, ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అసిస్టెంట్ కృష్ణకిషోర్‌ల సమక్షంలో రూ.4.79లక్షలు విలువ చేసే 8388 కర్ణాటక మద్యం ప్యాకెట్లను రాళ్ళబూదుగూరు చెరువులో పొక్లెయినర్‌తో ధ్వంసం చేయించారు. అధికారులు మాట్లాడుతూ అక్రమమద్యం వ్యాపారంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

సీపీఎస్ రద్దుకు కృషి చేయండి

సదుం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం మదనపల్లె పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీని ఏపీసీపీఎస్ ఈఏ నాయకులు పచ్చార్ల సుధాకర్, సుబ్రహ్మణ్యం, వసంత్ కుమార్ కలిశారు.

స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం

చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డులను సోమవారం నాయకులతో కలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రదానం చేశారు. ఆయా విభాగాలకు చెందిన సిబ్బంది వీటిని అందుకున్నారు.



కలెక్టర్ నుంచి జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డు స్వీకరిస్తున్న కుప్పం ఏఎంసీ చైర్మన్ మునిరాజు - కొత్తపల్లె పీహెచ్‌సీ, కుప్పం మండలం, పలమనేరు ఏరియా ఆస్పత్రి (స్వచ్ఛ ఆసుపత్రి) - పుంగనూరు (స్వచ్ఛ మున్సిపాలిటీ) - సోమల మండలం ఇరికిపెంట అంగన్‌వాడీ కేంద్రం (స్వచ్ఛ అంగన్వాడీ కేంద్రం) - యామగానిపల్లె, గుడుపల్లె మండలం, మల్లనూరు, కంగుంది కుప్పం మండలం (స్వచ్ఛ గ్రామ పంచాయతీలు) - తుమ్మిశి మోడల్ స్కూల్, శాంతిపురం మండలం, ఎంపీపీఎస్ కమ్మపల్లె, పులిచెర్ల మండలం (స్వచ్ఛ స్కూల్స్) - బాలికల బీసీ హాస్టల్, కుప్పం, ట్రైబల్ బాలుర హాస్టల్, కుప్పం(స్వచ్ఛ హాస్టల్స్) - గడ్డంవారిపల్లె, చౌడేపల్లె మండలం, (విలేజ్ ఆర్గనైజేషన్స్)

రికార్డులు లేని వాహనాలు సీజ్

పుంగనూరు రూరల్ (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో తిరుగుతున్న రికార్డులు లేని వాహనాలను సీజ్ చేస్తున్నట్లు పుంగనూరు ఎంవీఐ సుప్రియ హెచ్చరించారు. సోమవారం పట్టణంలో వాహనాలు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.



శ్రీనివాసులు, పలమనేరు మున్సిపాలిటీ, గంగమ్మ, కుప్పం మున్సిపాలిటీ, హరిబాబు, పుంగనూరు మున్సిపాలిటీ (బెస్ట్ స్వచ్ఛతా వారియర్స్) విభాగం) - బాలకృష్ణ, పెద్ద చారాలగుంట, వి.కోట, నాగరాజు, పెద్ద చారాలగుంట, బైరెడ్డిపల్లె, బాలకృష్ణ, కొలమాసనపల్లె, పలమనేరు (బెస్ట్ స్వచ్ఛతా గ్రీన్ అంబాసిడర్స్) కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకొంటున్న పలమనేరు నాగమణి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు శ్రీపురం సీతారామయ్య, ఆయన కుటుంబసభ్యులు

పవన్‌కళ్యాణ్‌ను కలిసిన వేణుగోపాల్‌రెడ్డి



పవన్‌కళ్యాణ్‌ను కలసిన వేణుగోపాల్‌రెడ్డి

పుంగనూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్నాటకలోని చింతామణిలో సోమవారం జరిగిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల్‌గౌడ్ జన్మదిన వేడుకలకు హాజరైన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను పుంగనూరు జనసేన నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన నాయకులు శివకుమార్‌రెడ్డి, విరూపాక్షి, కుమార్, బాలాజీ నాయక్, హరినాయక్, శ్రీరాములు, నాగరాజనాయక్ పాల్గొన్నారు.

మంత్రి మనోహర్‌ను కలిసిన జనసేన నాయకుడు

పుంగనూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌ను పుంగనూరు జనసేన నాయకుడు కోలా సోమశేఖర్ సోమవారం తెనాలిలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పుంగనూరు నియోజకవర్గంలో జనసేన పార్టీపై మంత్రి ఆరా తీసినట్లు సోమశేఖర్ చెప్పారు.

ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని బస్సు ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలు... పుంగనూరు చింతలవీధికి చెందిన బాలాజీ కుమారుడు మహేశ్(25), రమేష్ కుమారుడు హరీశ్(20)లు కలిసి ద్విచక్ర వాహనంలో కర్నాటక రాష్ట్రం చింతామణిలోని బంధువుల ఇంటికి వెళుతుండగా రామసముద్రం సమీపంలో బస్సు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు.

కేబుల్ వైర్ చోరీపై పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కేబుల్ వైరు చోరీ చేశారంటూ పుంగనూరు మండలం పెద్దగడిదేశి గ్రామస్తులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని పాళ్యంపల్లె పంచాయతీ పెద్దగడిదేశి గ్రామానికి తాగునీటి కోసం వేసిన బోరు మోటర్ మరమ్మతులకు గురికావడంతో బయటకు తీసినట్లు తెలిపారు. రెండు రోజుల తర్వాత బోరుమోటర్ బిగించడానికి వెళ్లి చూడగా కేబుల్ వైరు కనిపించలేదని, చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు భూసేకరణపై గ్రామసభ

రామకుప్పం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల కోసం భూసేకరణ చేట్టనున్న మణీంద్రం గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు కౌలేష్ తెలిపారు. ఈ గ్రామసభకు రైతులతోపాటు గ్రామపెద్దలు హాజరుకావాలని ఆయన కోరారు.

పీకేఎం ఉడా చైర్మన్ ప్రమాణస్వీకారానికి తరలిన టీడీపీ శ్రేణులు



డాక్టర్ సురేష్‌బాబును సన్మానిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో సోమవారం జరిగిన పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్‌బాబు ప్రమాణస్వీకారోత్సవానికి రామకుప్పం మండలం నుంచి గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు అంజనేయరెడ్డి, ఆనందరెడ్డిల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో నేతలు, కార్యకర్తలు తరలివెళ్ళారు. ప్రమాణస్వీకారం అనంతరం సురేష్ బాబును అభినందలతో ముంచెత్తి, సన్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణ, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో చైర్మన్ మహ్మద్‌రఫీ, ఎస్టీసెల్ జిల్లా, నియోజకవర్గ అధ్యక్షులు కృష్ణానాయక్, కామరాజనాయక్, కడ సలహాకమిటీ సభ్యుడు రఘు, నేతలు రామ్మూర్తి, శ్రీనివాసులురెడ్డి, గుర్రప్ప, గంట్లప్పగౌడు, నందారెడ్డి, రామలింగారెడ్డి, జేయి, సత్తి, జయశంకర్, కొళ్లపల్లెబాబు, పెరుమాళ్, చంద్రశేఖర్ రెడ్డి, అవినాశ్‌రెడ్డి, మురళీ, కుమార్, కేశవరెడ్డి, రవిరెడ్డి, నవీన్, మురళీమోహన్, రాజన్న, విజయ్‌కుమార్, మురళీ, బాలరాజు, కృష్ణారెడ్డి, మహేంద్రనాయుడు, లోకేశ్, భానుమూర్తి, భూపతి, పాండియన్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెకు తరలిన నేతలు, కార్యకర్తలు



పీకేఎం-ఉడా చైర్మన్ ప్రమాణస్వీకారానికి తరలుతున్న టీడీపీ శ్రేణులు

వి.కోట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో జరిగిన పీకేఎం ఉడా చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవానికి భారీ ఎత్తున టీడీపీ శ్రేణులు తరలివెళ్ళారు. సోమవారం ఉదయాన్నే వి.కోట మండల నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సుమారు 30 కార్లలో మదనపల్లెకు పయనమయ్యారు. అక్కడ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న డాక్టర్ సురేష్ బాబును మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, పీఏసీఎస్ అధ్యక్షులు హరినాథరెడ్డి, నారాయణస్వామి తదితరులు ఆయన్ను కలిసి గజమాలలు వేసి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, శబరీష్, చంద్రారెడ్డి, విశ్వనాథరెడ్డి, సోము, గుణ, నాగరాజు, రవి, నాగరాజు, విశ్వనాథ్, కృష్ణప్ప, సతీష్, కోదండరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ఉమ్మర్, రాంబాబు, రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవు

కుప్పం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. కుప్పం పట్టణ పరిధిలోని దుకాణాల్లో సోమవారం మున్సిపల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాల యజమానుల నుంచి సుమారు 10 కిలోల బరువు కలిగిన సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను సేకరించి, వారికి జరిమానాలు విధించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించి, పర్యావరణాన్ని కాపాడాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు.

యానాదులకు రక్షణ కల్పించాలి

కుప్పం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం ఎంకే.నూరులో యానాదులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని యానాదుల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల చెంచు మల్లికార్జునరావు డిమాండ్ చేశారు. యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కుప్పంలోని మున్సిపల్ సెంట్రల్ పార్కునుంచి డీఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. చెంచు మల్లికార్జునరావు మాట్లాడుతూ కొన్నిరోజుల క్రితం ఎంకే.నూరులో యానాదులపై దాడిచేసిన వారిపై కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని కోరారు. డీఎస్పీ పార్థసారథి మాట్లాడుతూ దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసి, యానాదులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం నాయకులు అత్తూరు చెంగల్రాయులు, మోహూరు అడివయ్య, ఎలుగోటి రేవతి, తిరుపతి రాములమ్మ, పనబాకుల కల్పన, స్థానిక గిరిజన నాయకులు నారాయణ, వెంకటరమణ, వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలి

కల్లూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని ఎంఈవో పోకల తాతయ్య, హెచ్ఎం హరిశంకర్ తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న హాకీ క్రీడాకారులకు సోమవారం రూ.22వేల విలువైన గ్రాఫైట్స్ హాకీ స్టిక్స్‌ను కావేటిగారిపల్లికి చెందిన దాత ఉప్పు లోకనాథం వితరణ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న దాత లోకనాథంను అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీకేఎం ఉడా చైర్మన్‌కు సన్మానం

పుంగనూరు రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో సోమవారం జరిగిన పీకేఎం ఉడా చైర్మన్ సురేష్‌బాబు ప్రమాణస్వీకారం సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను పుంగనూరు మార్కెట్‌కమిటీ చైర్మన్ నానబాల శమిపతి మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, టీడీపీ నాయకులు సీవీరెడ్డి, మాధవరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● బైరెడ్డిపల్లె (ఆంధ్రజ్యోతి): పీకేఎం-ఉడా చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ సురేష్‌బాబును సోమవారం టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, తెలుగుయువత అధ్యక్షుడు భువనచంద్రగౌడు కలిసి సత్కరించారు. ప్రత్యేక అభినందనలు తెలిపారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ ఆర్థికసాయం

రామకుప్పం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం రాజుపేటకు చెందిన శంకర్‌బాబు సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. టీడీపీ మండల ప్రధానకార్యదర్శి నరసింహులు స్థానిక నేతలతో కలిసి శంకర్‌బాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి పార్టీ తరఫున రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నేతలు నారాయణస్వామి, వెంకటస్వామి, పెద్దనారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం రామసముద్రం మండలంలో చోటు చేసుకుంది. వివరాలు... అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం తిరుమలరెడ్డిపల్లెకు చెందిన డి.సునంద(33) తన పిల్లలు చెప్పిన మాట వినలేదని పురుగులమందు తాగి అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యుల గుర్తించి వెంటనే పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు



సాత్విక

చౌడేపల్లె, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని దుర్గసముద్రం పంచాయతీకి చెందిన వెంకటరత్నం కుమార్తె సాత్విక(15) ఈనెల 4 నుంచి కనిపించక పోవటంతో ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాలిక ఆచూకీ తెలిస్తే చౌడేపల్లె ఎస్ఐ ఫోన్ నంబరు 9440900698కు సమాచారం అందించాలని కోరారు.

మహిళను కుటుంబ సభ్యులకు అప్పగింత



నాగలక్ష్మిని తహసీల్దార్ పార్వతి సమక్షంలో కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

చౌడేపల్లె, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ముందు అదృశ్యమైన మహిళను స్థానిక పోలీసులు సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు వివరాలు... మండలంలోని లద్దిగంకు చెందిన రమేష్ భార్య నాగలక్ష్మి జులై 14న పుంగనూరు నక్కబండకు వెళ్లి వస్తానని తిరిగి రాలేదు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. హైదరాబాద్‌లో ఆమె ఆచూకీ లభించగా ఆమెను తీసుకొచ్చి తహసీల్దార్ పార్వతి ముందు హాజరుపరిచి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వందనదేవి, కానిస్టేబుల్ రాణి తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు సంజీవని కిట్ల పంపిణీ

సదుం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగువారిపల్లె పంచాయతీ పరిధిలోని బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సంజీవని కిట్లను పంపిణీ చేశారు. పోషకాహార మహోత్సవాల్లో భాగంగా సోమవారం జోగువారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు, ఆరోగ్య జాగ్రత్తలు, బాల్య వివాహాలతో జరిగే అనర్థాలు, తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అండర్-17 జిల్లా చెస్ పోటీలకు పుంగనూరు విద్యార్థుల ఎంపిక

పుంగనూరు రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అండర్-17 జిల్లా చెస్ పోటీలకు ఎంపికైన పుంగనూరు మండలం గూడూరుపల్లె జడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సతీష్, పుంగనూరు జడ్పీ బాలికోన్నతపాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎ.నవ్యశ్రీలను సోమవారం ఉపాధ్యాయులు అభినందించారు.

రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం

చౌడేపల్లె, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రీసర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ పార్వతి పేర్కొన్నారు. సోమవారం ఆమె మండలంలోని ఏకొత్తకోట, పందిళ్ళపల్లె పంచాయతీల్లో రీసర్వేపై రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రదీప్‌రాజు, నారాయణరాజు, మునిరాజు, మునిరత్న, డీటీ దొరస్వామి, సర్వేయర్లు మురళి, సంధ్య, సురేంద్ర, శారద, సుకన్యా, విజయ్ పాలొన్నారు.

నాలుగునెలల జీతాలు వెంటనే చెల్లించాలి

పలమనేరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నాలుగునెలల జీతాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం ఆస్పత్రి కార్యాలయ అధికారికి సీపీఎం నాయకులు గిరిధర గుప్తా, పారిశుధ్య కార్మికులు వినతిపత్రం అందజేశారు. గిరిధర గుప్తా మాట్లాడుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్ తక్షణమే స్పందించి కాంట్రాక్టరును పిలిపించి వెంటనే కార్మికులకు జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

కనుజువంకలో పూడికతీత చేపట్టాలి

వి.కోట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వి.కోట, రామకుప్పం మండలాల పరిధిలో ప్రవహించే కనుజువంక గొలుసుకట్టు చెరువులకు నీటిని మళ్లించడం వల్ల రెండు మండలాల్లో వేలాది మంది రైతులకు లబ్ధి చేరూరుతుందని ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వివరించారు. సోమవారం చిత్తూరులో గ్రీవెన్‌డేలో కలెక్టర్‌ను కలసి కనుజువంక ప్రాజెక్టును గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, దాని వల్ల ఐదేళ్ల గొలుసుకట్టు చెరువులు నిండక ఆయకట్టు రైతులు ఇబ్బంది పడ్డారని వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్ శాఖ ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీటీసీ రామూర్తి, సోము, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాల్మీకి జయంతి

పుంగనూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఇందిరాసర్కిల్‌లో మంగళవారం జరిగే వాల్మీకి జయంతి వేడుకలను విజయవంతం చేయాలని వాల్మీక సంఘ నాయకుడు, టీడీపీనేత కే.సుకుమార్‌బాబు పిలుపునిచ్చారు. వాల్మీక కులస్తులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం

చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డులను సోమవారం నాయకులతో కలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రదానం చేశారు. ఆయా విభాగాలకు చెందిన సిబ్బంది వీటిని అందుకున్నారు.

● విలేజ్ ఆర్గనైజేషన్లు..


ఎం.కొత్తూరు, నగరి మండలం


కొల్లాగుంట, కార్వేటినగరం మండలం


నల్లిశెట్టిపల్లె, తవణంపల్లె మండలం

● స్కూల్స్..


జడ్పీ హైస్కూల్, బీరప్పచెరువు, ఐరాల మండలం


ప్రభుత్వ పాఠశాల, బంగారుపాళ్యం

● గ్రామ పంచాయతీలు..


కాణిపాకం, ఐరాల మండలం

● హాస్టళ్లు..


సోషల్ బాలికల హాస్టల్, నగరి

● అంగన్‌వాడీలు..


అగరమంగళం అంగన్‌వాడీ కేంద్రం, జీడీ నెల్లూరు


మహాసముద్రం అంగన్‌వాడీ కేంద్రం, బంగారుపాళ్యం

● ఇండస్ట్రీలు..


షాహీ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్, చిత్తూరు


విశ్వ అపెరల్స్, చిత్తూరు

● మహిళా సమాఖ్యలు..


పొన్నియమ్మ మహిళా సమాఖ్య, నగరి


శ్రీవిరూపాక్షి మహిళా సమాఖ్య, చిత్తూరు

● ఎన్జీవోలు


నాగమణి చారిటబుల్ ట్రస్టు, చిత్తూరు

● గ్రీన్ అంబాసిడర్లు


విజయ్‌కుమార్, అగరంపల్లె, ఐరాల

● కార్మికులు..


వెంకటేశ్, చిత్తూరు మున్సిపాలిటీ


రవి చంద్రన్, నగరి మున్సిపాలిటీ

జీఎస్టీ 2.0పై విద్యార్థులకు అవగాహన

నగరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కామర్స్ విభాగం ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0పై సోమవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఆర్.వేణుగోపాల్, కామర్స్ విభాగ ఇన్‌చార్జి భాస్కర్, అధ్యాపకులు వేణుగోపాల్, రెడ్డి నాయక్, గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ జీఎస్టీ 2.0పై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణశారద, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దారికి అడ్డంగా రాతి కూసాలు

పోలీసులకు ఫిర్యాదు చేశామన్న సర్పంచ్

వెదురుకుప్పం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎంపురం గ్రామ పంచాయతీ కరవాటికండ్రిగకు వెళ్లే దారికి అడ్డంగా రాతి కూసాలు నాటి ఇబ్బంది పెడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశామని సర్పంచ్ తులసి కుమారి సోమవారం తెలిపారు. ఆమె మీడియాకు వివరాలు తెలిపారు. కరవాటికండ్రిగకు రోడ్డు వసతి లేక తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఈ నేపథ్యంలో 2014లో ఈ మార్గంలోని రైతులంతా కలసికట్టుగా అంగీకరించి రోడ్డు వేసుకోవడానికి ప్రజాప్రతినిధులకు చెప్పడంతో జడ్పీ నిధుల నుంచి రూ.7.5 లక్షలు కేటాయించి 2014లోనే మట్టి రోడ్డు ఏర్పాటు చేశారన్నారు. ఈ రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఉండటంతో సర్పంచ్ ఆధ్వర్యంలో తొలగించే పనులు చేపట్టారు. అయితే కరవాటికండ్రిగకు చెందిన కె.మునిచంద్రయ్య, కె.బాలాజి, ఎం.మాధవ ఆ దారికి అడ్డంగా రాతి కూసాలు నాటేశారని చెప్పారు. దీనిపై వీఆర్వోకి ఫిర్యాదు చేస్తే పట్టించుకోక పోవడంతో పోలీసులను ఆశ్రయించామన్నారు. మంగళవారం కలెక్టర్‌ను కలుస్తామని తెలిపారు.


కరవాటికండ్రిగకు వెళ్లే రోడ్డుకు అడ్డుగా నాటిన రాతి కూసాలు

నేడు వాల్మీకి జయంతి

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం కలెక్టరేట్‌లోని వివేకానంద భవన్‌లో ఉదయం 10.30 గంటలకు జరగనుంది. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

కాణిపాకం పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం పోలీస్ స్టేషన్‌ను సోమవారం సాయంత్రం డీఎస్పీ సాయినాథ్ పరిశీలించారు. కాణిపాక క్షేత్రానికి దేశ, విదేశాల నుంచి నిత్యం వేలమంది భక్తులు విచ్చేస్తుంటారన్నారు. నేరాలు జరగకుండా ప్రతి ఒక్కరూ మరింత బాధ్యతగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఎస్‌ఐ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపుల్లో తనిఖీలు

పాలసముద్రం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బలిజకండ్రిగ, గంగమాంబాపురంలో ఉన్న మద్యం షాపులను సోమవారం కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి తన సిబ్బందితో కలసి తనిఖీలు చేశారు. ఇటీవల అన్నమయ్య జిల్లా మొలకలచెరువులో నకిలీ మద్యం పట్టుబడటంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు నిర్వహించారు.



వైభవంగా పులిగుండు గిరిప్రదక్షిణ

పెనుమూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలం పులిగుండు వద్ద వెలసిన పార్వతీపరమేశ్వరులు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పౌర్ణమి సందర్భంగా ప్రతి నెలా నిర్వహించే గిరిప్రదక్షిణ కొత్తరోడ్డు, రాణావేణుగోపాలపురం, సీఎస్ అగ్రహారం మీదుగా పులిగుండు శివాలయం వరకు సాగింది. ఆలయ నిర్వహకుడు షణ్ముగరెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

← శేషవాహనంపై విహరిస్తున్న ఆది దంపతులు

మొరవ పారుతున్న బీరప్ప చెరువు



ఐరాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు బీరప్ప చెరువు మొరవ పారుతోంది. అటవీ ప్రాంతం నుంచి వచ్చే నీరు చేరి చెరువు నిండటంతో మొరవ సాగుతోంది. చెరువుకు రైతులు పూజలు నిర్వహించి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీరు కలుషితం కాకూడదు

పాలసముద్రం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండటం వల్ల గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సతీష్ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. తాగునీరు ట్యాంకుల నుంచి ఇళ్లకు వెళ్లే పైపు లైన్లు ఎక్కడైనా లీకేజీ ఉంటే అరికట్టాలన్నారు. ట్యాంకులను ప్రతి 15 రోజులకు క్లోరినేషన్ చేయించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఎంపీడీవో ఆరా

గుడిపాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాలని సోమవారం ఇన్‌చార్జి ఎంపీడీవో కుమార్‌కు దళవాయిపల్లె గ్రామస్తులు విన్నవించారు. దాంతో మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడితో కలిసి గ్రామానికెళ్లి సమస్యపై ఆరా తీశారు. సమస్యను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు విషయం తెలియజేయడంతో కొత్త బోరు మంజూరు చేశారు. కార్యదర్శి సుందరేషన్, సింగిల్ విండో డైరెక్టర్ హరిప్రసాద్, పురుషోత్తం పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఏదీ : ఏఐవైఎఫ్



నగరి ఆర్డీవో కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

నగరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ భృతి ఎక్కడని ఏఐవైఎఫ్ నాయకులు ప్రశ్నించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ఈ మేరకు నిరసన తెలిపారు. ఆర్డీవో అనుపమకు వినతిపత్రం అందజేశారు. నాయకులు ముత్తు, నేతాజీ, రాజకోటి మాట్లాడుతూ.. నిరుద్యోగ భృతి రూ.3వేలను ఇస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన ప్రభుత్వం 17 నెలలుగా ఆ ఊసే ఎత్తలేదన్నారు. వీరికి ఏఐటీయూసీ జిల్లాప్రధాన కార్యదర్శి కోదండయ్య మద్దతు తెలపగా, ఉదయకుమార్, రాబిన్‌హుడ్, హర్షిత్, మయూర నాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సమావేశం


సమావేశంలో ప్రసంగిస్తున్న సునీల్‌కుమార్

బంగారుపాళ్యం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జడ్పీ మాజీ చైర్మన్ ఎంబీ కుమార్ రాజా స్వగృహంలో సోమవారం వైసీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పూతలపట్టు సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ.. గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. నాయకులు రామచంద్రారెడ్డి, శిరీష్‌రెడ్డి, ఎంబీ కృష్ణమూర్తి, ప్రకాష్‌రెడ్డి, దత్తురెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కృపాసాగర్‌రెడ్డి, థామస్, కామరాజు, కిషోర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ నన్ను అకారణంగా కొట్టారు

● 189.కొత్తపల్లెవాసి ఆరోపణ

చిత్తూరు సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గుడిపాల ఎస్‌ఐ తనను అకారణంగా కొట్టారని 189.కొత్తపల్లె గ్రామానికి చెందిన యశ్వంత్ ఆరోపించారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. గత నెలలో వినాయక చవితి సందర్భంగా జరిగిన నిమజ్జన వేడుకల్లో గ్రామంలోని యువకులతో కలసి తాను కూడా పాల్గొన్నానన్నారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన ఎస్‌ఐ తనను అకారణంగా కొట్టారన్నారు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే భవిష్యత్ లేకుండా చేస్తానని బెదిరించాడని వాపోయాడు. ఎస్పీ స్పందించి ఎస్‌ఐపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



పెనుమూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-పెనుమూరు రహదారిలో మఠంపల్లె వద్ద రోడ్డుపై వర్షపు నీరు నిలిచింది. ఈ నీరు పక్కనే ఉన్న బస్టాప్‌లోకి వెళ్లడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

'పీజీఆర్ఎస్'కు 15 అర్జీలు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 15 అర్జీలు అందినట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. బాధితుల నుంచి అర్జీలను అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ స్వీకరించారు. ఇంజనీరింగ్‌కు 6, పింఛన్లకు 4, ప్రణాళిక విభాగానికి 2, ప్రజారోగ్యానికి 2, టిడ్కోకు ఒకటి చొప్పున అర్జీలు వచ్చాయి. ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామానికి రేషన్ దుకాణం మంజూరు చేయండి

● తహసీల్దార్‌కు చామంతిపురం గ్రామస్తుల వినతి

గుడిపాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి రేషన్ దుకాణం మంజూరు చేయాలని చామంతిపురం గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం తాము మూడు కిలోమీటర్ల దూరంలోని నాగేంద్రపురంలో ఉన్న రేషన్ షాపుకెళ్లాల్సి వస్తోందన్నారు. విచారించి, సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. డీటీ వెంకటరమణ, మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుటుంబ సమేతంగా సోమవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు


సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తవణంపల్లె, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

వెదురుకుప్పం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మారేపల్లె కాలనీకి చెందిన కె.మల్లీశ్వరయ్య కుమారుడు భార్గవ్(9) వెదురుకుప్పం పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం వెదురుకుప్పంలో ఉండగా గుర్తు తెలియని బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడి కాలు విరిగి, దంతాలు రాలిపోయాయని స్థానికులు తెలిపారు. బాధితుడిని చికిత్స నిమిత్తం తిరుపతి బర్డ్ ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు.

మినీలారీ ఢీకొని వృద్ధురాలి మృతి


రాజమ్మ మృతదేహం

బంగారుపాళ్యం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మినీలారీ ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందారు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. కుమ్మరపల్లెకి చెందిన రాజమ్మ(70) సోమవారం రోడ్డు దాటుతుండగా చిత్తూరు నుంచి పలమనేరు వైపు వెళుతున్న మినీలారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వృద్ధురాలిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందింది. మృతిరాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఛాత్రోపాధ్యాయులకు వన్యప్రాణులపై అవగాహన


సమావేశంలో పాల్గొన్న వెంకటసుబ్బయ్య తదితరులు

వెదురుకుప్పం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో ఛాత్రోపాధ్యాయులకు సోమవారం కార్వేటినగరం అటవీ శాఖ ద్వారా వన్యప్రాణులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అటవీశాఖ కార్వేటినగరం శాఖ అధికారి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ.. వన్యప్రాణుల వల్ల ప్రయోజనాలను తెలియజేశారు. డీఆర్వో ఆనందరెడ్డి, ఎఫ్ఎస్వో లోకేశ్, బీట్ అధికారులు వినోద్, గంగులయ్య, శ్రీనివాసులు, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దామోదరం పాల్గొన్నారు.

పాచిగుంట చౌకదుకాణంలో ఆగిన సరుకుల పంపిణీ

● ఆందోళన వ్యక్తం చేసిన రేషన్‌కార్డుదారులు
● వీఆర్వో ఆధ్వర్యంలో పంపిణీ చేస్తామన్న తహసీల్దార్

యాదమరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పత్రపల్లె పంచాయతీ పాచిగుంట చౌకదుకాణంలో సరుకుల పంపిణీ ఆగిపోయింది. ఈ దుకాణానికి డీలర్‌గా పెరుమాళ్ వ్యవహరించేవారు. గతనెలలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో అలసత్వం వహించారంటూ ఆయన్ను ఆర్డీవో ఆదేశాలతో రెవెన్యూ అధికారులు సస్పెండ్ చేశారు. తనపై అన్యాయంగా చర్యలు తీసుకున్నారని ఆయనేమో హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో దుకాణంలో సరుకుల పంపిణీ చేయకుండా ఆపేస్తే ఎలా అంటూ సోమవారం రేషన్‌కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ పార్థసారథిని వివరణ కోరగా.. వీఆర్వో ఆధ్వర్యంలో సరుకులు పంపిణీ చేస్తామని చెప్పారు.

సీజేఐపై దాడిని ఖండిస్తున్నాం

చిత్తూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) గవాయిపై కోర్టులో జరిగిన దాడిని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం తెలిపారు. సోమవారం దర్గా వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన న్యాయవాదిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సుశీలమ్మ, మురళి, షణ్ముగం, పొన్నయ్య, దేవరాజు, మొగులయ్య, గుణశేఖర్, కార్తీక్, రామమూర్తి, నాగరాజు, చంద్రబాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ నేతలు

సంక్షిప్తంగా..

రేపు ద్విచక్ర వాహనాల వేలం

చిత్తూరు సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు అర్బన్, రూరల్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలను బుధవారం బహిరంగ వేలం వేయనున్నట్లు చిత్తూరు ఎక్సైజ్ అర్బన్ సీఐ శ్రీహరి రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కోర్టుఎదురుగా ఉన్న అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో 8న ఉదయం 10 గంటలకు వేలం ఉంటుందన్నారు. ధరావతు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

ఉచిత వైద్యశిబిరం

విజయపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పన్నూరు దళితవాడలో సోమవారం తిరుపతి రమాదేవీ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. నాయకులు బాబు, లక్ష్మీపతి, పెరుమాళ్, దొరైరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

వెదురుకుప్పం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని హజరత్ మహబూబ్ సుబహాని దర్గాలో సోమవారం అన్నదానం చేశారు. జియావుద్దీన్, కూలం సాహెబ్, డంకా హమీద్ బాషా, ఉస్మాన్, షేక్ సందానిఫయాజ్, ఇర్ఫాన్, సాబీర్, షబ్బీర్, ఖాదర్, యాకూబ్, గౌసి, నిసార్, అజార్ పాల్గొన్నారు.

వైభవంగా పౌర్ణమి పూజలు

నింద్ర, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కూనమరాజుపాళెంలో మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం, గీతామందిరం ఆశ్రమంలో పౌర్ణమి పూజలను సోమవారం నిర్వహించారు. గీతామందిర ఆశ్రమ పీఠాధిపతి పుండరీక వరదానంద స్వామి, వేద పండితులు రూపేష్ కృష్ణ ఆచార్య, ఉభయదారులు పుష్యంత్ వర్మ కుటుంబీకులు పాల్గొన్నారు.

నివాళి



వెదురుకుప్పం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బొమ్మనదొడ్డ క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో సామిరెడ్డి కండ్రిగకు చెందిన యుగంధర్(19) మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న జనసేన జీడీనెల్లూరు ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న గ్రామానికి వచ్చి యువకుడి మృతదేహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు.

'అక్రమంగా వేసిన పాకను తొలగించాలి'

వెదురుకుప్పం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తమ ఆధీనంలో ఉన్న భూముల్లో అక్రమంగా వేసిన పాకను తొలగించాలని బొప్పలమడుగుకు చెందిన ప్రేమ్‌కుమార్‌రెడ్డి, పాండురెడ్డి, నరసింహారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ బాబుకి వినతిపత్రమిచ్చారు. విచారించాలని క్షేత్రస్థాయి ఉద్యోగులను ఆదేశించినట్లు బాబు తెలిపారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



శ్రీరంగరాజపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆరిమాకులపల్లెలోని గంగమ్మకు నియోజకవర్గం ఐటీడీపీ అధ్యక్షుడు పైనేని మురళి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వెంకటాచలపతి, నాయకులు రవి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నగరిలో సువర్ణవర్ణ రథం



నగరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా తమిళనాడు, తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు నుంచి ప్రేమ ప్రవాహిని సువర్ణవర్ణ రథం తిరుత్తణి వెళుతూ మార్గమధ్యంలో సోమవారం నగరికి విచ్చేసింది. శ్రీ సత్యసాయి భజన మండలి నగరి కన్వీనర్ లాయర్ మురళీధర్ ఈ రథానికి స్వాగతం పలికి, సత్య సాయిబాబా చిత్రపటానికి హారతి పట్టారు. తడుకుపేటలో కన్వీనర్ వెంకటరమణ స్వాగతం పలికారు.